క్లుప్తంగా

పరామర్శ



శ్రీహరినాయుడును పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ విక్రాంత్

రేగిడి: మండలంలోని దేవుదల గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ సభ్యుడు కెంబూరు శ్రీహరిరావునాయుడు అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ ఆదివారం దేవుదల గ్రామానికి వెళ్లి శ్రీహరిరావునాయుడును పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. పరామర్శించిన వారిలో అప్పాపురం, లక్ష్మీపురం సర్పంచ్‌లు కరణం శ్రీనివాసరావు, కెంబూరు వెంకటేశ్వరరావు ఉన్నారు.

కూలిన పెంకిటిల్లు



కూలిన పెంకిటిల్లును చూపిస్తున్న బాధిత కుటుంబ సభ్యులు

రాజాం: పట్టణంలోని అమ్మవారి కాలనీలో బత్తిన నాగరాజుకు చెందిన పెంకిటిల్లు ఆదివారం కూలిపోయింది. ఇటీవల కురిసిన వర్షాలకు పెంకిటిల్లు పైకప్పు పూర్తిగా పాడవ్వడంతో ఈ ప్రమాదం జరిగిందని బాధిత కుటుంబ సభ్యులు తెలిపారు. ఇల్లు కూలిన సమయంలో కుటుంబ సభ్యులు వివిధ పనుల నిమిత్తం బయట ఉండడంతో ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరుగలేదు. కాలనీకి చెందిన గ్రామపెద్ద పెంకి గౌరీశ్వరరావు సంఘటనా స్థలాన్ని పరిశీలించి తహసీల్దార్ రాజశేఖర్‌కు సమాచారం అందించి, బాధితకుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు.

2,500 రోజులుగా అన్నదానం



పేదలకు అన్నదానం చేస్తున్న సిద్ధార్థ

రేగిడి: మండలంలోని వావిలవలస గ్రామానికి చెందిన సామాజిక కార్యకర్త పాలూరి సిద్ధార్థ నిత్యన్నదాన కార్యక్రమాన్ని నిరాటంకంగా కొనసాగిస్తున్నారు. గ్రామంలోని రాహుల్ సౌరభ్ నిత్యాన్నదాన సత్రంలో నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమానికి ఆదివారం నాటికి 2500 రోజులు పూర్తయ్యాయి. దాతల సహకారంతో పేదలు, అనాథల ఆకలి తీర్చడం తమకెంతో ఆనందాన్నిస్తోందని సిద్ధార్థ తెలిపారు.

శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీకి నివాళులు



శ్యామ్‌ప్రసాద్‌ముఖర్జీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బీజేపీ నేతలు

బొబ్బిలి: కేంద్ర మాజీ మంత్రి, జనసంఘ్ వ్యవస్థాపకులు,తొలినాళ్ల హిందూ జాతీయ వాదిగా పేరొందిన శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ జయంతిని పట్టణంలో బీజేపీ నాయకులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజేష్ వర్మ, నియోజకవర్గ కన్వీనర్ మరిశర్ల రామారావు, నీలంచౌదరి, సాయికుమార్, శ్రీనివాసరావు, లక్ష్మి,తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సహాయం



అనిల్‌కుమార్‌కు నగదు అందజేస్తున్న శిష్టకరణ లిఫ్టింగ్ హ్యాండ్స్ సభ్యులు

రాజాం: ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో సేవలందిస్తున్న శిష్టకరణ లిఫ్టింగ్ హ్యాండ్స్ సభ్యులు రాజాం పట్టణంలోని తెలగ వీధిలో నివాసం ఉంటున్న ఉరిటి అనిల్‌కుమార్‌కు రూ. 51 వేల ఆర్థిక సాయం అందించారు. అనిల్‌కుమార్‌కు గత నెల 26న గుండె సంబంధిత ఆపరేషన్ జరిగింది. పేద కుటుంబం కావడం, అనీల్‌కుమార్ దీనస్థితిని గుర్తించిన శిష్టకరణ లిఫ్టింగ్ హ్యాండ్స్ సభ్యులు వైద్య ఖర్చుల నిమిత్తం తమ వంతు సాయం చేశా రు. నగదును శిష్టకరణ లిఫ్టింగ్ హ్యాండ్స్ గ్రూపు అడ్మిన్ త్యాడ ప్రసాద్, సభ్యులు వాండ్రంగి తిరుమలరావు, బగ్గాం జోగారావుల సమక్షంలో బాధితుడికి ఆదివారం అందజేశారు. త్యాడ ప్రసాద్ మాట్లాడుతూ అనిల్‌కుమార్‌కు మందులు నిమిత్తం నగదు ఇచ్చామని వెల్లడించారు. గతంలో 16 మందికి సాయం అందించామని చెప్పారు. కార్యక్రమంలో ఉరిటి రామలింగేశ్వరరావు, అనంత పట్నాయకుని శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

నేరేడు పండు.. పోషకాలు మెండు

- నేరుడు పండులో పుష్కలంగా పోషకాలు, ఔషధ గుణాలు
- ఆరోగ్యానికి మంచిదని చెబుతున్న వైద్యులు
- సీజన్ కావడంతో మార్కెట్లలో తోపుడు బళ్లపై నేరేడు పండ్ల విక్రయాలు



రాజాంలో నేరేడు పండ్ల విక్రయాలు

రాజాం:

ఇండియన్ బ్లాక్ బెర్రీగా పిలుచుకునే నేరేడు పండ్ల సీజన్ వచ్చేసింది. ఈ పండ్లను ఇష్టపడని వారుండరు. కాస్త వగరు,పులుపు, తీపి,కలబోతగా ఉండే వీటిలో పోషకాలు పుష్కలం. ప్రస్తుతం సీజన్ కావడంతో గ్రామాలు, పట్టణాల్లో ఎక్కడ చూసినా నేరేడు పండ్లు లభిస్తున్నాయి. సీజన్‌లో మాత్రమే లభించే నేరేడు పండును గ్రామాల్లో ప్రజలు సర్వరోగ నివారిణిగా భావిస్తారు. గ్రామాల్లో పొలాల గట్లపై ఎక్కడికక్కడ నేరేడు చెట్లు ఉండడం వల్ల అక్కడి ప్రజలకు ఈ పండ్లు ఉచితంగానే లభిస్తాయి. పట్టణ వాసులు మాత్రం మార్కెట్లలో కొనుగోలు చేసుకుంటుంటారు. ఇతర ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకున్న జంబో నేరేడు పండ్లతో పాటు దేశీయ నేరేడు పండ్ల విక్రయాలు రాజాం పట్టణంలో జోరుగా సాగుతున్నాయి. వీటి ధర ప్రస్తుతం కిలో రూ.100 నుంచి రూ.150 వరకు పలుకుతోంది. సీజనల్ వ్యాధులకు గురికాకుండా రోగనిరోధక శక్తి పెంచడంలో ఈ పండ్లు బాగా పని చేస్తాయని, విటమిన్‌లు, పోషకాలు సమృద్ధిగా ఉంటాయని వైద్యులు చెబుతుండడంతో ప్రజలు వీటిని ఎంత ధరకైనా కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపిస్తున్నారు.

మెండుగా ఔషధగుణాలు

నేరేడు పండ్లలో మంచి ఔషధ గుణాలు, పోషక విలువలు ఉన్నాయి.సాంప్రదాయ వైద్యంలో నేరేడు పండ్లు, ఆకులు, విత్తనాలు, బెరడు అన్నీ ఉపయోగమే. బెరడులో టానిన్లు, కార్బోహైడ్రేట్లు ఉంటాయి.

- నేరేడు పండ్లు రక్తశుద్ధికి దోహదపడతాయి. ఐరన్ పుష్కలంగా ఉండడం వల్ల ఈ పండ్లు బ్లడ్ ప్యూరిఫైయర్‌గా పనిచేస్తాయి. ఆక్సిజనేటెడ్ రక్తాన్ని మొత్తం శరీరానికి రవాణా చేయడానికి సహాయపడుతోంది.
- కళ్లు, చర్మ ఆరోగ్యానికి ఉపయోగపడే ఏ, సి, విటమిన్లు ఇందులో ఉన్నాయి. జిడ్డు చర్మాన్ని తాజాగా, మృదువుగా, మొటిమలు లేకుండా చేస్తుంది.
- జీర్ణక్రియ వ్యవస్థకు సంబంధించి సమస్యలున్న వారు నేరేడు పండ్లు తీసుకోవడం వల్ల వీటిలోని శీతలీకరణ గుణం జీర్ణ రుగ్మతను నయం చేయడానికి సహాయపడుతుంది
- నేరేడు పండ్లలో ఆక్సాలిక్ ఆమ్లం, గ్యాలిక్ ఆమ్లం, మాలిక్ ఆమ్లం, టానిన్స్ మొదలైనవి ఎక్కువగా ఉంటాయి. ఇవి ఇన్ఫెక్షన్ లేకుండా చేసే సామర్థ్యం ఉంది. యాంటీ బ్యాక్టీరియల్ లక్షణాలు కలిగి ఉండడం వల్ల అంటువ్యాధులను నివారిస్తాయి. దంతాలు, చిగుళ్లకు వచ్చే ఇన్ఫెక్షన్ల నుంచి నివారణ కల్పిస్తుంది.
- నేరేడులో ఉండే పొటాషియం గుండె రుగ్మతల నివారణకు ఎక్కువగా ఉపయోగపడుతుంది. ఇవి గుండెను ఆరోగ్యంగా ఉంచడానికి, రక్తపోటు, ఇతర హృదయ సంబంధిత వ్యాధులను నివారించడానికి ఉపయోగపడుతోంది.
- ప్రధానంగా రక్తంలో చక్కెర స్థాయిని నియంత్రించడంలో సహాయపడే లక్షణాలు నేరేడు పండులో ఉండడం వల్ల మధుమేహంతో బాధపడేవారికి ఇవి చాలా మంచిది.
- జిగట విరేచనాల నుంచి ఉపశమనానికి నేరేడు పండ్లు ఎంతో ఉపయోగపడతాయి. నేరేడు రసం, దనియాల పొడి కలిపి తాగితే జ్వరం నుంచి తక్షణ ఉపశమనం పొందవచ్చని వైద్యులు అంటున్నారు.
- నేరేడులో యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. ఇవి శరీరంలోని చెడు కొవ్వును కరిగించి, మంచి కొవ్వు లెవల్స్‌ను పెంచుతాయి. దీంతో గుండె జబ్బుల ప్రమాదం కూడా తగ్గుతుంది.

ఎన్నో ప్రయోజనాలు



నేరేడు పండ్లు తినడం వల్ల ఆరోగ్యప్రయోజనాలు కలుగుతాయి.ఈ పండ్లను ఏ వయస్సు వారైనా తినవచ్చు. కేవలం ఈ సీజన్‌లో మాత్రమే ఇవి లభిస్తాయి. దీర్ఘకాలిక వ్యాధుల నుంచి ఉపశమనం ఇస్తుంది. జీర్ణక్రియ క్రమబద్ధీకరణతో పాటు చర్మ సౌందర్యానికి ఈ పండ్లు ఎంతో ఉపయోగపడతాయి.

– డాక్టర్ కరణం హరిబాబు, రాజాం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్

వైఎస్సార్ జయంతిని ఘనంగా నిర్వహిద్దాం..



మాట్లాడుతున్న శంబంగి

బొబ్బిలి: దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్. రాజశేఖరరెడ్డి జయంతిని బొబ్బిలి నియోజకవర్గ వ్యాప్తంగా ఈనెల8వ తేదీన ఘనంగా నిర్వహించాలని మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త, శంబంగి వెంకట చిన అప్పలనాయుడు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. బొబ్బిలిలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నియోజకవర్గంలోని డాక్టర్ వైఎస్సార్ విగ్రహాలన్నింటినీ శుభ్రపరచి, నూతన రంగులతో వేడుకలకు సిద్ధం చేయాలన్నారు. రక్తదాన శిబిరాలు నిర్వహించాలని, విద్యార్థులకు పుస్తకాలు, రోగులకు రొట్టెలు, పాలు, పండ్లు, పేదలకు దుస్తుల పంపిణీ, అన్నదానం వంటి సేవా కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. అలాగే బొబ్బిలి వైఎస్సార్ సీపీ కార్యాలయంలో తన ఆధ్వర్యంలో నిర్వహించే వేడుకలకు పట్టణ, మండల పరిధిలోని నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు హాజరు కావాలని కోరారు.

నీటి తీరువా వడ్డీతో చెల్లించమనడం దారుణం



మాట్లాడుతున్న వేమిరెడ్డి లక్ష్మునాయుడు

బొబ్బిలి: ఖరీఫ్ పనులు జోరుగా సాగుతున్నప్పటికీ కూటమి ప్రభుత్వం పెట్టుబడి సాయం అందించక పోగా, నీటి తీరువా మాత్రం వడ్డీ తో సహా చెల్లించాలని నోటీసులు ఇవ్వడం దారుణమని రైతు సంక్షేమ సంఘం అధ్యక్షుడు వేమిరెడ్డి లక్ష్మునాయుడు అన్నారు. పట్టణం లోని రైతు సంక్షేమ సంఘ కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. అన్నదాత సుఖీభవ పథకం కింద ఏడాదికి రూ.20 వేలు పెట్టుబడి సాయం ఇస్తామని టీడీపీ కూటమి ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొందని, కూటమి అధికారం చేపట్టి ఏడాది పూర్తయిందని, గతేడాదికి సంబంధించి పెట్టుబడి సాయం ఎగ్గొట్టారని విమర్శించారు. పెట్టుబడి సహాయం ఎగ్గొట్టిన ప్రభుత్వం రైతులను మాత్రం నీటి తీరువాను 6 శాతం వడ్డీతో సహా చెల్లించమంటోందన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రైతుల కష్టసుఖాల నెరిగి అందరు రైతులకూ రైతు భరోసా పథకం కింద పెట్టుబడి సహాయం అందించిందని, నీటి తీరువా వసూలు చేయలేదని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం మాత్రం రైతులను వడ్డీతో చెల్లించమంటూ రెవెన్యూ అధికారులతో నోటీసులు ఇప్పిస్తోందని, ఇది ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. నీటి తీరువా కడితేనే పెట్టుబడి సాయం ఇస్తామన్న రీతిలో కూటమి ప్రభుత్వం ఉందన్నారు. ఇది రైతులకు ఎంతమాత్రం శ్రేయస్కరం కాదని కూటమి నాయకులు, ముఖ్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గుర్తెరగాలన్నారు. లేకుంటే రైతుల ఆగ్రహం కట్టలు తెంచుకుని రోడ్లపైకి వస్తారన్నారు.

లెప్రసీపై ఇంటింట సర్వే



సంకిలిలో సర్వే చేస్తున్న వైద్యసిబ్బంది

రేగిడి: గ్రామీణ ప్రాంతాల్లో లెప్రసీ(కుష్టు) వ్యాధిగ్రస్తులను గుర్తించేందుకు ఇంటింట సర్వే చేస్తున్నామని రేగిడి పీహెచ్‌సీ హెల్త్ సూపర్‌వైజర్ కె.వి అప్పారావు తెలిపారు. సంకిలి గ్రామంలో సిబ్బందితో కలిసి ఆదివారం సర్వే చేశారు. ఇంటింటికీ వెళ్లి చర్మంపై స్పర్శ లేని, నొప్పి, దురద లేని మచ్చలు, కనురెప్పలు పూర్తిగా మూయ లేకపోవడం, చేతులు, పాదాలు తిమ్మిర్లు ఎక్కడం వంటి లక్షణాలు ఎవరికైనా ఉన్నాయా అని ఆరా తీశారు. ఈ లక్షణాలు ఉంటే అశ్రద్ధ చేయకుండా పీహెచ్‌సీకి వచ్చి లెప్రసీ నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఏఎన్‌ఎం టి.జ్యోతమ్మ, ఎంఎల్‌హెచ్‌పీ ఎన్. దుర్గా దేవి, ఆశ వర్కర్ పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రశంసాపత్రాల అందజేత



విద్యార్థులతో ఎమ్మెల్యే బేబీ నాయన, నిర్వాహకులు

బొబ్బిలి: కర్ణాటక సంగీతం కోర్సు కోసం ప్రభుత్వం గతేడాది నిర్వహించిన ప్రవేశ పరీక్షలో ఉత్తీర్ణులైన వివిధ ప్రాంతాలకు చెందిన 35 మంది విద్యార్థులకు ఎమ్మెల్యే ఆర్.వి.ఎస్.కె.కె.రంగారావు(బేబి నాయన) ఆదివారం ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలు అందజేశారు.స్థానిక శ్రీ కళాభారతి మున్సిపల్ ఆడిటోరియంలో స్వర రాగ సంగీతాలయ ఆధ్వర్యంలో విద్యార్థులకు అభినందన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో స్వరరాగ సంగీతాలయ నిర్వాహకులు వంగపండు సునీత,మాటూరి విజయలక్ష్మి, విద్యార్థుల తల్లిదండ్రులు,దేవులపల్లి సన్యాసిరావు, సిద్ధా సత్యనారాయణ,నంబియార్ వేణుగోపాలరావు, చెలికాని చెల్లారావు, రౌతు రామమూర్తి, పలువురు కళాకారులు పాల్గొన్నారు.

9న దేశవ్యాప్త సమ్మె



మాట్లాడుతున్న సీఐటీయూ నాయకులు

రాజాం సిటీ: కార్మిక సంఘాల పిలుపుమేరకు ఈ నెల 9వ తేదీన చేపట్టనున్న దేశవ్యాప్త సమ్మెను కార్మికులంతా విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పి.శంకరరావు కోరారు. పట్టణంలోని డి.సత్యనారాయణ కాలనీలో ఆదివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరశిస్తూ, హక్కుల సాధన కోసం దేశ వ్యాప్త సమ్మె తలపెట్టామని చెప్పారు. 9వ తేదీ ఉదయం 10 గంటలకు రాజాం ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి ర్యాలీ ప్రారంభమవుతుందని, మున్సిపల్ కార్మిక ఉద్యోగులు, కార్మికులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశ వర్కర్లు, ఆర్పీలు, మధ్యాహ్నభోజన పథకం నిర్వాహకులు, వీఓఏలు, క్లాప్ మిత్రలు, వీఆర్ఏలు, కళాసీలు, భవన నిర్మాణకార్మికులు, షాపుల్లో పనిచేస్తున్న కార్మికులు, ఉపాధ్యాయ సంఘాలు పాల్గొని, జయప్రదం చేయాలని కోరారు. సీఐటీయూ నాయకులు పి.రాజేష్, శ్యామల, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు మరమ్మతులు చేపట్టాలని రాస్తారోకో



రోడ్డుపై గోతుల్లో మొక్కలు నాటి నిరసన తెలుపుతున్న ఉనుకూరు గ్రామస్తులు

రేగిడి: రాజాం–వంగర ప్రధాన రహదారిలో మండలంలోని ఉనుకూరు గ్రామ పరిధిలో కిలోమీటరు మేర రోడ్డుపూర్తిగా పాడైంది. పెద్దపెద్ద గోతులు ఏర్పడడంతో ఈమార్గంలో ప్రయాణించే వారు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు రోడ్డు మరమ్మతులు చేయించకపోవడంతో విసిగివేశారిపోయిన గ్రామస్తులు సీఐటీయూ ఆధ్వర్యంలో ఆదివారం రాస్తారోకో చేశారు. రోడ్డుపై గోతుల్లో వరినాట్లు వేసి, మొక్కలు నాటి వినూత్నంగా నిరసన తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డును బాగు చేయాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు పి.శంకరరావు, కార్యదర్శి త్రినాథ్ కోరారు.

సంక్రమిత వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

రామభద్రపురం: జంతువుల నుంచి మనుషులకు సంక్రమించే వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని పశువైద్యాధికారి ఏ.అప్పలనాయుడు సూచించారు.ప్రపంచ జూనోసిస్ దినోత్సవం సందర్భంగా స్థానిక పశువైద్యశాలలో ఆదివారం పెంపుడు కుక్కలకు రేబిస్ వ్యాధి నిరోధక టీకాలు వేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుక్కలు పెంచే వారు జాగ్రత్తలు పాటించాలని, కుక్కలకు తప్పనిసరిగా యాంటీ రేబిస్ టీకా వేయించాలన్నారు. గ్రామ సచివాలయ వెటర్నరీ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

పిరిడి పశువైద్యశాలలో..

బొబ్బిలిరూరల్: పశువులు,పెంపుడు జంతువుల నుంచి మనుషులకు సంక్రమించే వ్యాధులపై అవగాహన కలిగి ఉండాలని పిరిడి పశువైద్యాధికారి సుధాకర్ అన్నారు. ప్రపంచ జూనోసిస్ దినోత్సవం సందర్భంగా పిరిడి పశువైద్యశాలలో పెంపుడు కుక్కలకు ఆదివారం టీకాలు వేశారు. పెంపుడు కుక్కలకు క్రమం తప్పకుండా రేబిస్ టీకాలు వేయించాలని చెప్పారు. పెంట గ్రామంలో వెటర్నరీ డాక్టర్ హిరణ్య పెంపుడు కుక్కలకు టీకాలు వేశారు.

ఘనంగా ఏకలవ్య జయంతి



కేక్ కట్ చేస్తున్న ఏపీవైఎస్ఎస్ జిల్లా అధ్యక్షుడు గౌరు

బాడంగి: మండలంలోని లక్ష్మీపురం గ్రామ పంచాయతీ పరిధి ఎరుకలపాకలు గ్రామంలో ఏకలవ్యుడి జయంతి వేడుకలను ఎరుకుల కులస్తులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. అతిథిగా హాజరైన ఏపీవైఎస్ఎస్ జిల్లా అధ్యక్షుడు పాలవలస గౌరు, స్థానికులు కలిసి ఏకలవ్యుడి విగ్రహానికి పూలమాలలు వేశారు. అనంతరం కేక్ కట్ చేశారు. రావివలస, ఉత్తరావల్లి, కూనాయివలస, బొబ్బిలి, తారాపురం,కొట్టక్కి గ్రామాలకు చెందిన ఎరుకుల కులస్తులు, లక్ష్మీపురం సర్పంచ్ పాలవలస పార్వతమ్మ, తదితరులు పాల్గొన్నారు.

డంపింగ్ యార్డులా పాఠశాల ప్రాంగణం




చిత్రంలో కనిపిస్తున్న చెత్తకుప్పలు ఎక్కడో డంపింగ్ యార్డులోనివి అనుకుంటే పొరపాటు. రాజాం పట్టణ నడిబొడ్డున ఉన్న ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో ఇలా చెత్తపేరుకుపోయింది. పాఠశాలలో మధ్యాహ్నభోజన వంటలకు ఉపయోగించే కూరగాయల, ఇతర వ్యర్థాలను నిర్వాహకులు అక్కడే పారబోస్తున్నారు. వీటికి తోడు ఇటీవల ఓ ఉపాధ్యాయుడు ఉద్యోగ విరమణ సందర్భంగా పాఠశాల ఆవరణలో భోజనాలు ఏర్పాటుచేశారు. భోజనాల అనంతరం ఆకులు, వ్యర్థాలు అక్కడే పడేశారు. ఇవి వర్షాలకు కుళ్లడంతో దుర్వాసన వస్తోంది. పారిశుద్ధ్య కార్మికులతో వీటిని తొలగించాల్సిన పాఠశాల యాజమాన్యం ఏమీ పట్టనట్టుగా వ్యవహరిస్తుండడంతో విద్యార్థుల తల్లిదండ్రులు మండిపడుతున్నారు. – రాజాం

తుప్పల్లో చెత్త సేకరణ వాహనాలు



ఒకప్పుడు స్వచ్ఛ సర్వేక్షణ్ కింద ఎంపికైన బొబ్బిలి మున్సిపాలిటీకి స్వచ్ఛ భారత్ నిధులతో ఇంటింటి చెత్త సేకరణ కోసం బ్యాటరీ వాహనాలు మంజూరు చేశారు. ఈవాహనాలు ఇప్పుడు తుప్పల్లో వదిలేశారు. అన్నట్టు వీటికి జీపీఎస్, సీసీ కెమెరాలు కూడా ఉన్నా యి. చిన్న చిన్న మరమ్మతులు చేస్తే పనికొచ్చే ఈ వాహనాలను మున్సిపల్ కార్యాలయ ఆవరణలో వదిలేయడంతో వాటి చుట్టూ పిచ్చి మొక్కలు,తుప్పలు మొలిచాయి. వినియోగించకుండా ఓ మూలన వదిలేయడంతో ఈ వాహనాలు పాడవుతున్నాయి. అధికారు లకు ఇంత నిర్లక్ష్యం తగదని, వాహనాలకు మరమ్మతులు చేసి వినియోగంలోకి తీసుకురావాలని మున్సిపల్ కార్యాలయానికి వచ్చే ప్రజలంతా కోరుతున్నారు. – బొబ్బిలి

యథేచ్ఛగా కాలువ కప్పేస్తున్నారు..!



రాజాం పట్టణంలోని డోలపేట నుంచి వాసవీనగర్ మీదుగా అంతకాపల్లి వరకు విస్తరించిన మురుగు కాలువను ఆక్రమణదారులు కప్పేస్తున్నారు. ఈ కాలువ ద్వారా డోలపేటతో పాటు మారుతీనగర్, ఈశ్వరనారాయణకాలనీ, బాబానగర్, పాలకొండ ప్రధాన రహదారి ప్రాంతాల మురుగునీరు శివారు ప్రాంతాలకు వెళుతుంది. కాలువను ఇరువైపులా ఆక్రమించి కప్పేయ డంతో వెడల్పు తగ్గిపోయింది. దీంతో మురుగునీటితో పాటు వర్షపునీరు శివారు ప్రాంతాలకు సక్రమంగా పారడం లేదు. మురుగు నీరు వార్డుల్లో జనావాసాల మధ్య ఉండిపోతోంది. మున్సిపల్ అధికారులు స్పందించి కాలువ ఆక్రమణలు తొలగించి, కాలువను పునరుద్ధరించాలని పట్టణవాసులు కోరుతున్నారు. – రాజాం

భక్తిశ్రద్ధలతో తొలిఏకాదశి పూజలు

బొబ్బిలి: తొలిఏకాదశి పర్వదినం సందర్భంగాపట్టణంలోని పలు ఆలయాల్లో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆషాఢ మాసంలో వచ్చే శుద్ధ ఏకాదశిని తొలి ఏకాదశి, శయన ఏకాదశి అని అంటారు. పట్టణంలోని తారక రామా కాలనీలో ఉన్న సీతారామ సహిత లక్ష్మణ, ఆంజనేయ ఆలయంలో ఉత్సవ మూర్తులకు పురోహితుడు వేణుగోపాలస్వామి ఆధ్వర్యంలో పూజలు చేశారు. అలాగే కంచర వీధిలోని కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఉత్సవ మూర్తులను కోలాటం ప్రదర్శనలతో పల్లకిపై ఊరేగించారు. ఈ ఆలయంలో సుభద్ర, బలభద్రస్వాములు పూజలందుకున్నారు.

బాడంగి మండలంలో..

బాడంగి: మండలంలోని రామాలయాలు, ఆంజనేయస్వామి ఆలయాల్లో ఆదివారం తొలి ఏకాదశి పూజలను నిర్వహించారు.పాల్తేరు గ్రామంలోని కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. ఆలయ అర్చకులు జి. సీతారామశాస్త్రి భక్తులతో పూజలు చేయించారు.



బొబ్బిలి పట్టణంలోని కంచరవీధిలో కల్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయం వద్ద ఉత్సవ విగ్రహాల ఊరేగింపు



బొబ్బిలిలోని కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో పూజలందుకుంటున్న సుభద్ర,బలభద్రస్వామి



బాడంగి: పాల్తేరులో భజన చేస్తున్న భక్తులు